

మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్న సిబ్బంది

మురుగునీటి సమస్య పరిష్కారం

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటిని కట్టడి చేయాలని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొంపల్లి నుంచి దూలపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే గల మురుగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం చర్యలు చేపట్టారు. ప్రయాణికులు, స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



కట్టమైసమ్మ చెరువును పరిశీలిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కట్టమైసమ్మ చెరువును పరిశీలించిన డీసీపీ

షాపూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గణేశ్ నిమజ్జనం కోసం సూరారం కట్టమైసమ్మ చెరువును మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సూరారం సీఐ భరత్‌కుమార్, ఎస్ఐ వెంకటేశం సోమవారం పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.



మహిళా భవన్‌కు భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

మహిళలు స్వయం శక్తితో రాణించాలి

షాపూర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం శక్తితో రాణించినప్పుడే సమాజ సాధికారత సాధ్యం అవుతుందని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సోమవారం న్యూశివాలయనగర్‌లో మహిళా భవన్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం పురోగతి వైపు పయనిస్తుందన్నారు. డివిజన్‌లో స్త్రీల పురోగతి కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చిట్టి, షెహనాజ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మబండలో ఉచిత వైద్యశిబిరం

గాజులరామారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దేవేందర్‌నగర్‌లోని బతుకమ్మబండ కమ్యూనిటీ హాల్లో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. బస్తీలు, కాలనీల వాసులు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని కాలనీ అధ్యక్షుడు చెట్ల వెంకటేష్ సూచించారు.



శోభనా సెంటర్ వద్ద కృష్ణస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ మహాసభ సభ్యులు

ఘనంగా మాజీ మేయర్ కృష్ణస్వామి జయంతి

బాలానగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర మాజీ మేయర్ కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు సోమవారం బాలానగర్ శోభనా సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ముదిరాజ్ మహా సభ ఆధ్వర్యంలో శోభనా సెంటర్ వద్ద కృష్ణస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్ డివిజన్‌ల ముదిరాజ్ కులస్థులు, అభిమానులు పాల్గొన్నారు.

భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ నియామకం

ఫతేనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులను సోమవారం నియమించారు. సభ్యులుగా ఉప్పలపు బాల నర్సింహారావు, గంటా వరాలస్వామి, గుండాల జ్యోతి, మాధురి సతీష్‌కుమార్, కంచి రాజ్‌కుమార్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎల్. వీరభద్రయ్యను నియమించారు.



కొవ్వొత్తుల ర్యాలీలో జగదీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు

డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

గచ్చిబౌలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యా ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొండాపూర్ మార్తాండ్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పవన్‌గౌడ్

మియాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ ప్రకాశ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతకింది పవన్‌గౌడ్‌ను కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతంగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి, కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అసోసియేషన్ సభ్యులతో కాంగ్రెస్ నాయకుడు బాలింగ్ గౌతంగౌడ్



నిజాంపేట అయ్యప్ప దేవాలయంలో శ్రీకృష్ణ పూజలో కొలన్ హన్మంత్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు



నిజాంపేట్ శ్రీనివాస్‌నగర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



రంగారెడ్డినగర్ నందానగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కమల ప్రసన్ననగర్ కాలనీలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కేపీహెచ్‌బీ వేణుగోపాలస్వామి దేవాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ నామ సహస్ర వాలి యజ్ఞం, కలశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు రెరా చైర్మన్ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ శ్రీరాందాస, ఎండోమెంట్ అధికారి సోమరాజు, ఇస్కాన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి/శేరిలింగంపల్లి/ కుత్బుల్లాపూర్, (ఆంధ్రజ్యోతి)



నిజాంపేటలో చిన్నారుల కోలాట ప్రదర్శన



నిజాంపేట వీధుల్లో పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి బృందం నగర సంకీర్తన



సూరారంలో గోపిక-కృష్ణ వేషధారణలో చిన్నారులు





కృష్ణుడి వేషధారణలో ఆద్య, మేథా



శ్రీకృష్ణుడి ఊరేగింపులో ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు



బాలానగర్ ఇందిరానగర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు



ఇందిరానగర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి



మసీద్‌బండలో కృష్ణాష్టమి వేడుకల్లో రవికుమార్‌యాదవ్ తదితరులు



కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్‌లో భక్తులు



మియాపూర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణనామ సహస్ర వాలి యజ్ఞం



రాధా, కృష్ణుల అలంకరణ



కొండాపూర్ సంస్కృతి పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారి







చిన్ని కృష్ణులు





మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, జనసేన నాయకులు

మదర్ థెరిస్సా సేవలు ఎనలేనివి

నిజాంపేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా చేసిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజీవ్‌గృహకల్పలో మదర్ థెరిస్సా జయంతిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కల్వరి టెంపుల్ వారి సహాయంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో..

కేపీహెచ్‌బీ కాలనీ: ఐదో ఫేజ్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో మదర్ థెరిస్సా జయంతిని సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

వినాయక మండపాల్లో డీజేలకు అనుమతి లేదు : ఏసీపీ

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులతో ఎన్‌కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో పోలీసులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకొని నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. మండపం ఏర్పాటు చేసేవారు పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయాలని, ముందస్తుగా నిర్ణయించిన తేదీల ప్రకారం విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలన్నారు. సమావేశంలో కూకట్‌పల్లి లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో ముత్తు యాదవ్, డీఐ వెంకటేశం, సెక్టార్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

హైదర్‌నగర్: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండప నిర్వాహకులతో హెచ్ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పోలీసు అధికారులు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మండపాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కేపీహెచ్‌బీ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐలు సుమన్, మన్యం, రూప, ట్రాఫిక్ ఎస్ఐ మాధవరెడ్డి, కాలనీ అధ్యక్షుడు కేఎస్ఆర్ మూర్తి, కార్యదర్శి గోపీచంద్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాలతో మహిళలు

భెల్‌కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భెల్ ఎంఐజీ కాలనీలో లలితా పోచమ్మ దేవాలయంలో సోమవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడురోజులపాటు పోచమ్మతల్లికి పంచామృతాలతో విశేష అభిషేకం, కుంకుమార్చనలు, లలిత సహస్రనామార్చనలు, భజన కార్యక్రమాలు జరిగాయి. సోమవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన, భజన కార్యక్రమాలు జరిగాయి. మాజీ కౌన్సిలర్, దేవాలయ వ్యవస్థాపకుడు మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఘటాల ఊరేగింపులో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు పుష్పానగేష్ యాదవ్, రాగం నాగేందర్ యాదవ్, సింధూ ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీలోగల ఫోర్త్‌ఫేజ్ నుంచి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.



రహదారిలో పారుతున్న మురుగు నీరు, ఇన్‌సెట్‌లో పొంగుతున్న మ్యాన్‌హోల్

రహదారిపై నిత్యం మురుగునీరు

● దుర్వాసనతో ప్రజలకు ఇబ్బంది ● పట్టించుకోని అధికారులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రహదారిపై పారుతున్నది వరద నీరు అనుకుంటే పొరపాటే. నిత్యం మురుగునీరు ప్రవహిస్తోంది. అందులో నుంచి ప్రయాణికులు, పాదచారులు, విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. రద్దీగా ఉండే చింతల్ నుంచి సుచిత్రకు వెళ్లే ప్రధాన రహదారిలో మురుగునీరు పారుతుండడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పద్మానగర్, తెలుగుతల్లి విగ్రహం సమీపంలో ప్రతిరోజూ డ్రైనేజీ పొంగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

దుండిగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గండిమైసమ్మ నుంచి మేడ్చల్‌కు వెళ్లే దారిలో పెద్ద మసీదు వద్ద ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వ్యక్తి మృతదేహం